క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న ఎర్నిమాంబ అమ్మవారు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం, సోమన్నపాలెం, రెడ్డీలపాలెం, గొల్లలపాలెం ప్రాంతాల గ్రామదేవత శ్రీ ఎర్నిమాంబకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్నిమాంబకు స్థానిక మహిళలు పసుపు కుంకుమతో ప్రత్యేక పూజలు చేసి, మంగళవాయిద్యాల నడుమ సారె సమర్పించారు.

వామనావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం : జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు వామనావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ఆర్.కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి అవతార విశిష్టతను వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తరించారు.

అధ్వానంగా సబ్ స్టేషన్ రోడ్డు



పీఎం పాలెంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్లే రోడ్డు

పీఎం పాలెం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్లే రోడ్డు చాలా అధ్వానంగా తయారైంది. దీంతో సబ్ స్టేషన్‌కు పని మీద వెళ్లే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో మంది నిత్యం రాకపోకలు సాగించే ఈ రోడ్డు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సబ్ స్టేషన్‌కు చేరేందుకు ఈ ఒక్కటే మార్గమని, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాలు పొడిగా ఉంచండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎంవోహెచ్ కిషోర్, సిబ్బంది

కొమ్మాది : వర్షాలు కురుస్తున్నందున విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు సాధ్యమైనంత వరకు పరిసరాలు పొడిగా ఉంచుకోవాలని ఏఎంవోహెచ్ ఎస్.కిషోర్ సూచించారు. జీవీఎంసీ 8వ వార్డు సుభాష్‌నగర్‌లో శనివారం ఆయన గడప గడపకు వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పలుచోట్ల నివాసాల మధ్య నిల్వ ఉన్న నీటిని తొలగించి జీవీఎంసీ సిబ్బందితో పిచికారి చేయించారు. కార్యక్రమంలో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ మంగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముహూర్తం చిక్కలేదా...!

- మధురవాడ జోనల్ కార్యాలయం అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.50 లక్షల కేటాయింపు
- పనులు పూర్తయినా ప్రారంభించని అధికారులు



అలంకారప్రాయంగా జోనల్ కమిషనర్ చాంబర్



అభివృద్ధి పనులు పూర్తయిన మధురవాడ జోనల్ కార్యాలయం

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయంలో పునర్నిర్మాణ, సుందరీకరణ పనులు పూర్తయినా టీడీపీ నాయకుల అపాయింట్‌మెంట్ దొరక్క అధికారులు ప్రారంభించడం లేదు. బాగా పాడుబడి, కళావిహీనంగా తయారైన జోనల్ కార్యాలయం సుందరీకరణ, పునర్నిర్మాణం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏడాది కిందట రూ.50 లక్షలు మంజూరు చేసింది. అనంతరం అధికారులు పనులు ప్రారంభించినప్పటికీ ఎన్నికలు కారణంగా కాస్త ఆలస్యమైంది. అప్పటి జీవీఎంసీ కమిషనర్ తరచూ జోనల్ కార్యాలయాన్ని సందర్శించి నిర్ణీత సమయంలోగా పనులు పూర్తి చేయించేందుకు ప్రయత్నించారు. ఎట్టకేలకు నెల రోజుల కిందట పనులు పూర్తయి కార్యాలయం సుందరంగా ముస్తాబై అందుబాటులోకి వచ్చింది. అయినప్పటికీ నాయకులు ప్రారంభించలేదని అధికారులు వినియోగించడం లేదు.

ఇరుకు గదిలోనే జెడ్సీ విధులు

పాత భవనానికి ప్రారంభం ఏమిటి అనుకుంటే మీరు పొరబడినట్టే... రూ.50 లక్షలతో చేపట్టిన పనులు పూర్తయినప్పటికీ టీడీపీ నాయకులు ప్రారంభించకపోవడంతో జోనల్ కమిషనర్ చాంబర్ అలంకార ప్రాయంగానే మిగిలిపోయింది. ఆమె మాత్రం పక్కనే ఉన్న ఇరుకు గదిలోనే విధులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల ప్రతీ సోమవారం పీజీఆర్ఎస్, కనీసం డిపార్ట్‌మెంట్స్ హెడ్స్‌తో కూడా కూర్చుని మాట్లాడుకోవడానికి స్థలం సరిపోని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ప్రారంభానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉదరకోశ వ్యాధులపై వైద్యులకు అవగాహన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ప్రభాకర్

తగరపువలస : సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రి ఆడిటోరియంలో శనివారం ఉదర కోశ వ్యాధులపై గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి ప్రొఫెసర్ ప్రభాకర్, సీఈవో చంద్రశేఖరరెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం చేస్తున్నప్పుడు 90 శాతం కడుపులో గ్యాస్ట్రిక్ సంబంధిత వ్యాధులు వెలుగు చూస్తున్నాయన్నారు. వీటికి విచ్చలవిడిగా మందులు వాడకూడదన్నారు. ప్రజలు కూడా ఎక్కువగా మెడికల్ షాపుల నుంచి గ్యాస్ట్రిక్ మాత్రలు తెచ్చుకుంటున్నారన్నారు. కడుపు మంట వచ్చినప్పుడల్లా గ్యాస్ట్రిక్ మందులు వాడకూడదన్నారు. సంబంధిత కారణాలు తెలుసుకుని మాత్రమే వైద్యం చేయాలని సూచించారు. నయం కాకుంటే ఆస్పత్రికి పంపించి చికిత్స చేయించాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల ఫెడరేషన్ ముఖ్య సలహాదారుడు డాక్టర్ ఎస్.ఎల్.రావు, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జంగం జోషి, ఎస్.సుగుణేశ్వరి, కోన ప్రకాష్, ముమ్మల తిరుపతిరావు, ఆకుల శ్రీనివాసరావు, గద్ద చిరంజీవి, నజ్మా, ఉదయ్, సురేష్, తదితర 200 మంది గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

గ్లాసులు, కంచాలు అందజేత



గ్లాసులు, కంచాలు అందిస్తున్న నరసింగరావు

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస భరోసా లిటిల్ హగ్స్ అనాథాశ్రమానికి ఎంఈవో కార్యాలయ ఉద్యోగి నరసింగరావు స్టీల్ గ్లాసులు, కంచాలు శనివారం అందించారు. వీటి విలువ రూ.5 వేలు ఉంటుంది. స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి ఆశ్రమాలకు అండగా నిలవాలని ఆయన కోరారు. ఆశ్రమం ఇన్‌చార్జి వెంపాడ శ్రీనివాసరెడ్డి, సాయి రవీంద్ర స్కూల్ ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం, కుటుంబం రెండూ ముఖ్యమే..

- కష్టపడిన సిబ్బందికి గుర్తింపు
- సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించిన వారితో పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి, జేసీపీ ఫకీరప్ప

అల్లిపురం: పోలీస్ సిబ్బందికి ఉద్యోగం ఎంత ముఖ్యమో.. కుటుంబం కూడా అంతే ముఖ్యమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. కమిషనరేట్ పరిధిలో పదోన్నతులు పొందిన 17 సివిల్, ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లను శనివారం కమిషనరేట్ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు కుటుంబాన్ని కూడా చూసుకోవాలన్నారు. కానిస్టేబుల్‌కు తన ఉద్యోగ జీవితంలో పదోన్నతి రావడం చాలా అరుదన్నారు. ఐపీఎస్‌లకు ప్రతి మూడేళ్లకు ఓసారి పదోన్నతి రావడం సహజమన్నారు. అదే సంతోషాన్ని కానిస్టేబుళ్లలో ఉండాలని భావించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పదోన్నతి చెందిన కానిస్టేబుళ్లను వారి కుటుంబ సభ్యుల మధ్య సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తన జీవితంలో ఇటువంటి కార్యక్రమానికి ఎప్పుడూ హాజరుకాలేదన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన వారికి సీపీ, జేసీపీ కె.ఫకీరప్ప, ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు.

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా..

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా పోలీస్ సిబ్బంది, నగర ప్రజలు, మీడియా కలసికట్టుగా పని చేయాలని సీపీ పిలుపునిచ్చారు. గంజాయి అమ్మేవారిని, సేవించే వారిని నగరం వదిలివెళ్లేలా చేద్దామన్నారు. ఇందుకోసం ఇప్పటికే నగరంలో అవసరమైన చోట సీసీ కెమెరాలు, చీకటి ప్రదేశాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. తన ఫోన్ నంబర్‌ను పబ్లిక్‌కు ఇచ్చానని, గంజాయి తాగిన వారు, అమ్మిన వారి సమాచారం వాట్సప్/ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జిల్లా యాదవ సంఘం ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు

మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర జిల్లాల యాదవ సంఘం ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం సిరిపురం వుడా చిల్డ్రన్ ఎరినాలో నిర్వహించనున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణ యాదవ్ హాజరుకానున్నారన్నారు. ఇటీవల గెలుపొందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లను సత్కరించనున్నామన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పిలి అప్పలకొండ, ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, నమ్మి వెంకట్, మొల్లి లక్ష్మణరావు, కార్యదర్శి డొక్కర శ్రీను, సారిపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

మురళీనగర్ : విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నాల్గవ జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయని వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ పోటీలకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని ముఖ్య అతిథిగా ఆహ్వానించామని చెప్పారు. విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట లలిత ప్రియ పర్యవేక్షణలో ఈ పోటీలు నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. అండర్–11, 14, 17, 17 ఏళ్లు దాటిన వారికి నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9505950425 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సింహాచలేశునికి వైభవంగా ఆర్జిత సేవలు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలతో స్వామికి అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.


◆ అప్పన్నస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేయజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

◆ సింహాచలేశుడికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

టెట్‌కు బ్రాహ్మణులకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: టెట్‌కు హాజరయ్యే బ్రాహ్మణ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వైజాగ్ బ్రాహ్మణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్ కుమార్ తెలిపారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులు పదో తరగతి, బీఈడీ, డీఈడీ, ఆధార్, జెరాక్స్ కాపీలను సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 99625 99790 / 92466 25822 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



ఏఈవో నరసింగరావుకు చెక్కు అందజేస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరానికి చెందిన బి.శ్రీనివాసరెడ్డి దాత రూ.లక్ష 1116, మాధవధారకు చెందిన కె.అన్నయ్య అనే దాత లక్ష 16 రూపాయల విరాళం ఇచ్చారు. సింహగిరిపై అన్నప్రసాద భవనంలో ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావుకు సంబంధిత చెక్కులు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందజేశారు.

కనక మహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీ దళార్చనలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు వెంపలి రాంబాబు, కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



ఇచ్ఛాపురం శిబిరంలో సిబ్బంది, స్థానికులు

తగరపువలస : ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ ఇచ్ఛాపురంలో శనివారం పీహెచ్‌సీ సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే మలేరియా రాకుండా ఉండాలంటే దోమల నిర్మూలన ఒక్కటే మార్గమన్నారు. ఇంట్లో, చుట్టుపక్కల నీటి నిల్వలు ఎక్కువ రోజులు ఉంచితే దోమలు గుడ్లు పెట్టి వృద్ధి చెందుతాయన్నారు. లార్వా దశలోనే దోమలను అరికట్టాలని సూచించారు. ఇందుకోసం వారినికి ఒకసారి పూర్తిగా నీటిని తొలగించి కొత్త నీటిని నింపుకోవాలన్నారు. ఖాళీ కొబ్బరి బోండాలు, తాగి పడేసిన టీ కప్పులలో వర్షం నీరు చేరి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇలా జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో 30 మందికి చికిత్స అందించారు. అనుమానం ఉన్న రోగులకు మలేరియా పరీక్షలు చేశారు. టైఫాయిడ్, విరేచనాలు రాకుండా పరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవాలని సూచించారు. అనంతరం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సూచనలు చేశారు. శిబిరంలో ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, ఆరోగ్య సేవకులు తారకేష్, ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణలత, ఏఎన్ఎం మెట్ట దేవి, ఆశా కార్యకర్త దేముడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు కట్టి.. రోడ్డు మరిచారు..!



ప్రస్తుతం బురదమయంగా మారిన రోడ్డు

కొమ్మాది : జీవీఎంసీ 5వ వార్డులో గల పరదేశిపాలెం ప్రాంతంలో కల్వర్టు నిర్మించిన అధికారులు రోడ్డు వేయకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారి నుంచి పరదేశిపాలెం, కాపులుప్పాడ వెళ్లే ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఈ మట్టి రోడ్డులో గోతులు ఏర్పడడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్



సంతపేటలో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డుల్లో దోమల నిర్మూలనకు శనివారం పారిశుధ్య సిబ్బంది ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది ఇంటింటా అవగాహన కార్యక్రమాల్లో భాగంగా దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జ్వరం, దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా ఆస్పత్రికి సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, తాగునీరు ఎప్పటికప్పుడు వేడి చేసుకుని తాగాలని సూచించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు.

సంపూర్ణంగా నేర్చుకుంటే వ్యక్తికి పరిపూర్ణత



ఇన్ఫోసిస్ ప్రాంతీయ నిపుణుడు నర్రా సురేష్‌ను సత్కరిస్తున్న అవంతి కళాశాల ప్రతినిధులు

తగరపువలస : ఒక వ్యక్తి పరిపూర్ణుడు కావాలంటే అతను సంపూర్ణంగా నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఇన్ఫోసిస్ విశాఖ ప్రాంతీయ నిపుణుడు నర్రా సురేష్ అన్నారు. చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో శనివారం పరిచయ వేదికలో భాగంగా ఆయన మాట్లాడారు. పరిశ్రమకు తగిన విధంగా విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. సాంకేతిక విద్యలో నైపుణ్యాలు, విజ్ఞానానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమస్యను గుర్తించడం, పరిష్కరించడంపై నిత్యం దృష్టి సారించాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్, క్రిటికల్ థింకింగ్ స్కిల్స్, హాకర్స్ ర్యాంకింగ్, కోడ్ కాంపిటీషన్, ప్రోగ్రామింగ్ స్కిల్స్, ఇంటర్వ్యూ గ్రూమింగ్, క్రియేటివిటీ ప్రాధాన్యతను వివరించారు. కార్పొరేట్ ప్రపంచంలో చోటు చేసుకున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాలన్నారు. జాబ్ మార్కెటింగ్‌లో అత్యుత్తమ ఉద్యోగాలను పొందేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డీన్ అండ్ ప్లేస్‌మెంట్ హెడ్ టి.శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ఎం.రూప సుందరరావు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ గోడ లేక పేరుకుపోతున్న పూడిక



పరదేశిపాలెంలో రక్షణ గోడ లేని భారీ కాలువ

మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డులోని పరదేశిపాలెం, పీపీ 2 కాలనీ, ఆర్‌జీకే కాలనీ, వైఎస్సార్, సాయిరాం కాలనీ, బోరవానిపాలెం తదితర ప్రాంతాల్లో భారీ కాల్వలకు కూడా రక్షణ గోడలు లేకపోవడంతో అవి తరచూ పూడుకుపోతున్నాయి. దీంతో మురుగు, వర్షం నీరు సక్రమంగా వెళ్లక నిత్యం ముంపు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా మధురవాడ నుంచి భగవాన్‌దాస్ కాలనీ, టీచర్స్ కాలనీ, సాయిరాం కాలనీ, మారికవలస సమీపంలోని డంపింగ్ యార్డు, పరదేశిపాలెం మీదుగా బంగాళాఖాతం వైపు మురుగు, వర్షం నీరు ప్రవహించే ఇలాంటి భారీ కాల్వలకు కూడా చాలా చోట్ల రక్షణ గోడలు లేవు. ఇలాంటి భారీ కాల్వలు మరిన్ని చోట్ల ఉన్నాయి. వీటికి రక్షణ గోడలు లేకపోవడంతోపాటు ఆక్రమణకు గురవడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తున్నాయి. చాలా చోట్ల రోడ్లపైన, మధురవాడ అప్ బ్రిడ్జి దగ్గర కూడా నీరు నిల్వ ఉండిపోవడానికి ఇలాంటి కాల్వలే కారణమైనా వీటి సంరక్షణ, రక్షణ గోడల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

పెదగంట్యాడ: మండలంలోని దయాల్‌నగర్, బీసీ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, సరియాపల్లికి చెందిన జలుమూరు ఆనందరావు (65) దయాల్‌నగర్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. అతను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటికి వస్తూ దయాల్‌నగర్ వద్ద బీసీ రోడ్డు దాటుతుండగా గాజువాక నుంచి పెదగంట్యాడ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న కర్రి మోహన్‌రావు ఢీకొట్టాడు. దీంతో ఆనందరావు తలకు తీవ్ర గాయాలవడంతో అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 9.30 గంటల సమయంలో మృతి చెందాడు. ఏఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.